నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | డిసెంబర్ 03, 2024 | www.navatelangana.com

అగ్ని ప్రమాదాలతో వన్యప్రాణులకు ముప్పు

నవతెలంగాణ-జన్నారం



అడవుల్లో అగ్ని ప్రమాదాలు చెలరేగితే చెట్లకు, వన్యప్రాణులకు ముప్పు ఉంటుందని జన్నారం ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు అన్నారు. సోమవారం జన్నారం, తాళ్ల పేట అటవీ రేంజ్‌లోని పలు ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అడవుల్లో నిప్పు పెట్టడం వల్ల చెట్లు, వన్యప్రాణులు చనిపోయే ప్రమాదం ఉందని, వాటికి దూరంగా ఉండాలన్నారు. అడవులలోకి వెళ్ళినప్పుడు చుట్టాలు సిగరెట్ బీడీ అగ్గిపెట్టెలు వాడకూడదన్నారు. వాటిని అటవీలో నిషేధించామన్నారు. కార్యక్రమంలో అటవీ అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన మురిమడుగుల ఇషాక్ కుటుంబానికి మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇషాక్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు సోమవారం మాజీ జడ్పీటీసీ రేండ్లగూడకు వెళ్లి ఇషాక్ కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయనతో పాటు సెటపెల్లి సత్యం, బోర్లకుంట ప్రభుదాస్, అల్లం నరేష్, సాయి కిరణ్ ఉన్నారు.

హామీలన్నీ గాలికే..!

- ప్రకటనలకే పరిమితమవుతున్న అటవీ అధికారులు
- అడవి జంతువుల బారిన పడి మృతి చెందిన కుటుంబాలకు అమలు కాని హామీలు



కొద్దో గొప్పో ఉన్న పొలాన్ని కష్టపడి సాగు చేసుకుంటేనే ఆ కుటుంబాలు జీవనం సాగించే పరిస్థితి. పొద్దున లేస్తే పంట చేలకు పరుగులు తీసి చేతికి అందివస్తున్న పంటను చూసి సంబరపడే జీవితాలు ఆ పంట చేలోనే అడవి జంతువుల బారిన పడి అర్థాంతరంగా ముగుస్తున్నాయి. ఇటువంటి కుటుంబాలను ఆదుకుంటామని అప్పటికప్పుడు కంటి తుడుపు చర్యగా చెబుతున్న అధికారులు తర్వాత వాటిని గాలికి వదిలేస్తున్నారు. ప్రస్తుతం కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి పులి దాడిలో మృతి చెందగా ఆ కుటుంబానికి అధికారులు ఇచ్చిన హామీల అమలు విషయంలో సందేహం నెలకొంది. దీనికి కారణం లేకపోలేదు. గతంలో పులులు, ఏనుగుల దాడులలో మృతి చెందిన వారికి అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడమే.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో 2020 నుండి ఇప్పటి వరకు పులుల దాడిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. 2020 నవంబర్ 11న దహెగాం మండలం దిగిడ గ్రామ సమీపంలోని పంట చేనులో పులి దాడి చేయగా సిడం విఘ్నేష్ మృతి చెందాడు. ఆ సమయంలో ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన అటవీ శాఖ ఉన్నతాధికారులు ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చే రూ.5 లక్షలతో పాటు మరో రూ. 5 లక్షలను ఇప్పిస్తామని, తండ్రి దస్రయ్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, ఐదెకరాల భూమి ఇస్తామని, ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇందులో ప్రభుత్వం నుండి రావాల్సిన రూ. 5 లక్షల పరిహారం తప్ప ఏదీ అమలు కాలేదు. 2020, నవంబర్ 29న పెంచికల్‌పేట మండలం కొండపల్లి గ్రామ శివారులో పత్తి పంట ఏరుతున్న పసుల నిర్మలపై పులి దాడి చేయడంతో ఆమె మృతి చెందింది. ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన అటవీ ఉన్నతాధికారులు ఆ కుటుంబానికి రూ. 5 లక్షల చెక్ అందించారు. ఇక్కడ కూడా అదనంగా రూ. 5 లక్షల పరిహారం, మూడెకరాల భూమి, ఇల్లు ఇస్తామని హామీలు ఇచ్చారు. కుమారుడు రాజంకు వాచర్ ఉద్యోగం ఇచ్చినా మధ్యలోనే మానేశాడు. తనకు కార్యాలయంలో ఉద్యోగం ఇప్పించాలని అటవీ అధికారుల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయాడు. ప్రస్తుతం మరణించిన మోర్లే లక్ష్మీ కుటుంబానికి కూడా రూ.10 లక్షల పరిహారం చెల్లించారు. ఇంకా ఐదెకరాల భూమి, మరో రూ.పది లక్షల పరిహారం, ఇల్లు, భర్తకు వాచర్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీలు కూడా గాలికి వదిలేస్తారా..? లేక అమలు చేసి ఆ కుటుంబానికి న్యాయం చేస్తారో లేదో చూడాల్సి ఉంది.

ఏనుగు బారిన పడి మృతి చెందిన కుటుంబాల పరిస్థితి కూడా ఇదే

ఈ ఏడాది మార్చిలో ఏనుగు బారిన పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. చింతలమానేపల్లి మండలం బూరెపల్లి గ్రామానికి చెందిన అల్లూరి శంకర్ ఈ ఏడాది మార్చి 3వ తేదీన మిర్చితోటలో పని చేస్తుండగా ఏనుగు అతన్ని తొక్కి చంపింది. ఈ కుటుంబం రూ. 25 లక్షలు డిమాండ్ చేయగా కేవలం రూ. 10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఉద్యోగం, ఇల్లు హామీ అలాగే ఉండిపోయాయి. ఇదే ఏడాది మార్చి 4న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లికి చెందిన కారు పోశన్నను కూడా ఏనుగు హతమార్చింది. ఇక్కడ బాధిత కుటుంబానికి రూ. 10లక్షలు ఇచ్చారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఐదెకరాల భూమి ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు అమలు కాలేదు.

భూమీ లేదు, ఉద్యోగమూ లేదు : సిడాం దస్రయ్య



'నా కొడుకు సిడం విఘ్నేష్ పులి దాడిలో మృతి చెంది నాలుగేళ్లైంది. అప్పట్లో మా ఇంటికి వచ్చిన అధికారులు భూమి, ఉద్యోగం ఇస్తామన్నారు. కానీ ఇప్పటి వరకు ఇవ్వలేదు. బేస్‌క్యాంప్‌లో కూలీకి రమ్మన్నారు. కానీ వెళ్లలేదు. కార్యాలయంలో చిన్న ఉద్యోగం ఇవ్వమని ప్రాధేయపడ్డా వాళ్లు ఇవ్వలేదు. భూమి కోసం అడిగిఅడిగి ఇక ఇవ్వరని తెలిసీ మా బతుకేదో మేము బతుకుతున్నాం'

ఉద్యోగం ఇప్పటి వరకు ఇవ్వలేదు : కారు భీమేష్



'మా నాన్న కారు పోశన్నను ఏనుగు చంపింది. ఇప్పటికీ 9 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు మాకు న్యాయం జరగలేదు. మా తమ్ముడు అంజన్నకు ఉద్యోగం ఇస్తామన్నారు. ఇవ్వలేదు. ఐదెకరాల భూమి ఇస్తామని చెప్పారు. ఇప్పటి వరకు అదీ లేదు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లకు వెళ్లి అధికారుల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయాం. భూమి కోసం కలెక్టర్ సారు దగ్గరికి కూడా వెళ్లాం. అయినా న్యాయం జరగలేదు.'

ప్రజా ఫిర్యాదుల విభాగంపై అధికారులు దృష్టి సారించాలి



నవతెలంగాణ-దండేపల్లి

ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు కొల్లూరి రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామాలలో నెలకొన్న పలు సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్ విజయకు వినతి అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి జిల్లా పెళ్లి రాజశేఖర్ యూత్ అధ్యక్షులు సాయికుమార్, నాయకులు ప్రశాంత్ దుర్గాప్రసాద్, వినయ్ రాజ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంతెన నవీన్, నాయకులు లింగంపల్లి మహేష్, జుల రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎంపీడీఓకు వినతి



నవతెలంగాణ-జన్నారం

కుట్టు శిక్షణ పూర్తి చేసిన తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కుట్టు శిక్షణ పూర్తి చేసిన మహిళలు కోరారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో న్యాక్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు కేంద్రంలో మహిళలకు ఇస్తున్న శిక్షణ ముగిసింది. దీంతో వారు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శశికళకు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థుల డ్రెస్సులు కుట్టే అవకాశం ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ముల్కల ప్రభాకర్, సునీతఅనూష దీప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణానికి చెందిన విద్యార్థులు మంచిర్యాలలో రెండు రోజులపాటు నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఒకరు రాష్ట్రస్థాయిలో, ఇంకొకరు జిల్లా స్థాయిలో రెండవ బహుమతి పొందాడు. వీరు అడిషనల్ కలెక్టర్ మోతిలాల్, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య చేతులమీదుగా ప్రశంస పత్రం, మెమెంటో అందుకున్నారు. నేషనల్ ఇన్నోవేషన్, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇన్‌స్పైర్ మనక్ 2023-24లో మదర్ థెరిసా పాఠశాలకు చెందిన జింజంపల్లి అనుదీప్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. అలాగే బాల వైజ్ఞానిక ప్రదర్శనలో వేస్ట్ మేనేజ్మెంట్ థీమ్‌కు గాను ఆకారపు సుశ్విక్ సాయి రెండవ బహుమతి పొందాడు. వీరికి గైడ్స్‌గా రాచర్ల సునీత వాణి, అక్కల దేవేంద్రలు వ్యవహరించారు. వీరిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

సైబర్ నేరాలపై అవగాహన



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా సోమవారం మండల పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ దత్తు, శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలువురికి సైబర్ నేరాలపై సూచనలు సలహాలు అందించారు. 1930, బ్యాంకు లావాదేవీలు, ఓటీపీలు షేర్ చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్‌కు గురైన బాధితులు 1930కు ఫోన్ చేస్తే తక్షణమే పరిష్కారం లభిస్తుందన్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈఓ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలంలోని వెంగ్వాపేట్ ఉన్నత పాఠశాలను సోమవారం డీఈఓ రామారావు ప్రార్థనా సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు సమయపాలన పాటించడం వలన భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉంటారని అన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పెండింగ్ డబ్బులు ఇచ్చాకే సర్వేలు చేయించాలి

- కలెక్టరేట్ ఎదుట ఆశాల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రభుత్వం గతంలో నిర్వహించిన లెప్రసీ, పల్స్ పోలీయోకు సంబంధించి పెండింగ్ డబ్బులు చెల్లించిన తరువాతనే కొత్త సర్వేలు చేయించాలని సీఐటీయూ కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సర్వేలో బిల్లులను విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ డిసెంబర్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కుష్టు గుర్తింపు సర్వే ప్రారంభించారన్నారు. ఆశాలు సర్వేలు చేయాలని, అధికారులు చెబుతున్నారన్నారు. కానీ గతంలో నిర్వహించిన సర్వేలకు సంబంధించి డబ్బులు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. పాత డబ్బులు ఇచ్చిన తరువాతనే కొత్త సర్వేలు చేయించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు గుర్తింపు కార్డులతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు శోభ, కార్యదర్శి సుజాత, ఆషా, పుష్ప, లక్ష్మీ సంగీత, ప్రేమలత, పద్మ, సురేఖ పాల్గొన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ప్రగతి శిలా మహిళా సంఘం (పీఓడబ్ల్యు) రాష్ట్ర సహాయ కార్యదర్శి కట్ల లక్ష్మి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో పలు ప్రయివేట్ ఆస్పత్రుల్లో ప్రగతిశీల మహిళా సంఘం బృందం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా రోగులను పరామర్శించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందక పోవడంతో, ప్రజలు తప్పని పరిస్థితిలో ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. టెస్టుల పేరుతో, మందుల పేరుతో, ఆపరేషన్ల పేరుతో, రూ.లక్షల బిల్లులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలానే ప్రయివేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లపై మెడికల్ మాఫియాపై ప్రయివేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ప్రభుత్వ నియంత్రణ ఉండాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు ఎస్.తారబాయి, మడావి రేణుక, మెస్రం సోను, ఎస్‌కె.షబానా, సావిత్రబాయి, రుక్మాబాయి, సంగీత, నాయకులు సాయికుమార్, కొడప సురేష్, మనోజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో గాడి తప్పిన విద్యా వ్యవస్థ



నవతెలంగాణ-ఇచ్చోడ

కాంగ్రెస్ పాలనలో గాడి తప్పిన విద్యా వ్యవస్థ నిర్వీర్యం చేస్తున్నట్టు బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఫరెజ్, జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను, బీఆర్ఎస్వీ జిల్లా కోర్డినేటర్ బుట్టి శివ కుమార్‌తో కలిసి సందర్శించారు. విద్యార్థులను కలిసి భోజన సౌకర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా గురుకుల పాఠశాల అధ్యాపకులకు తెలియజేయడం జరిగింది. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైన ఈ హెల్ప్ లైన్ నెంబర్‌ను 8522044336 విద్యార్థులు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు ఏనుగు కృష్ణారెడ్డి, దేవాపూర్ మాజీ సర్పంచ్ అబ్దుల్లా, ఆదిలాబాద్ బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వాగ్మరే ప్రశాంత్, మాజీ ఎంపీటీసీ సర్వేడే రమేష్, బీఆర్ఎస్ యువజన, నాయకులు మైలు మహేష్, పాండ్‌రంగ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



నవతెలంగాణ-కడెం

ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని అంబారీపేట్ గ్రామానికి చెందిన సాయిప్రియ ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు సుజాత, సాయిప్రియను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడారు. తమ గ్రామమైన అంబారిపేట్ గ్రామానికి చెందిన సాయిప్రియ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఆంగ్ల ఉపాధ్యాయురాలు సుజాత మాట్లాడారు. గతంలో తన వద్ద 2009-2010 సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థి నేడు తన తోటి ఉపాధ్యాయురాలిగా పని చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ కడెం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డ్రీమ్ సంస్థ కోఆర్డినేటర్ చిన్నయ్య అన్నారు. సోమవారం సోన్ మండలం కూచన్‌పల్లి గ్రామంలో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ఆయుష్మాన్ భారత్, ఇన్సూరెన్స్, పోస్టల్ బీమా పథకాల గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మండలంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను మున్సిపల్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థుకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాపాలన ఆరు గ్యారంటీ స్కీమ్‌లపై వ్యాసరచన పోటీ నిర్వహించి, బహుమతులను అందజేశారు. నిర్మల్ మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిద్ధ పద్మ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సులకు ప్రశంస పత్రాలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

రోగులకు ఉత్తమ సేవలు అందించిన నర్సులకు ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెడ్పీ కార్యాలయంలో సోమవారం అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో నర్సులు రోగులకు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న గిరిజన ఆశ్రమ విద్యార్థినులు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు క్రీడలో రాణిస్తున్నారు. రెండు రోజుల కింద మంచిర్యాల జిల్లాల్లో నిర్వహించిన పదో తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ కనబర్చారు. రాష్ట్రస్థాయి పోటీలో షాట్‌పుట్‌లో రెండో బహుమతి పొందిన పాఠశాల విద్యార్థిని జాదవ్ మౌనికను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ విఠల్, పీడీ విశ్వనాథ్ ఆడే, వార్డెన్ పవార్ వనిత అభినందించారు. వారి వెంట ఉపాధ్యాయులు వసంతరావ్, నీలయ్య, రాజేశ్వర్, శంకర్, సూరజ్‌సింగ్, రాథోడ్ సుదర్శన్, పండిత్‌సింగ్, రాథోడ్ ప్రకాష్, రాజశేఖర్, గంగా, రాజ్యలక్ష్మి, విజయ ఉన్నారు.

15 నుంచి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కొత్త బ్యాచ్ డిసెంబర్ 15 నుంచి ప్రారంభం కానున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ 30 రోజుల పాటు ఉంటుందని పేర్కొన్నారు. లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్సు, బ్యాడ్జీ నెంబర్ కలిగి ఉన్న అభ్యర్థులు రూ.15వేల 600 చెల్లించి శిక్షణలో చేరవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్ ఎస్కే యుసుఫ్ నెంబరును 9063400628 ను సంప్రదించాలని కోరారు.

22వ రోజుకు చేరుకున్న మహాపాదయాత్ర

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి గురుస్వామి శ్రీను ఆధ్వర్యంలో చేపట్టిన శబరిమల మహాపాదయాత్ర సోమవారానికి 22వ రోజుకు చేరుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మీదుగా కర్ణాటక రాష్ట్రంలో అడుగుపెట్టినట్టు గురుస్వామి తెలిపారు. నిన్నటి నుంచి కర్ణాటకలో వర్షం పడుతుండటంతో వర్షంలోనూ తమ శబరిమల మహా పాదయాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | డిసెంబర్ 03, 2024 | www.navatelangana.com

నిత్యావసర సరుకులు అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శాంతినగర్ చెందిన రాపని ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం విషయం తెలుసుకున్న యువ నాయకుడు దుర్వా మహేష్ వారి ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. బాధితుల కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో ప్రజ్ఞశీల్, భుజంగరావు, శివ, యూత్ అధ్యక్షుడు ఒళ్లేపు నరేష్, గణేష్ ఉన్నారు.



గొర్రెలకు, మేకలకు వ్యాక్సినేషన్ వేయించాలి

నవతెలంగాణ-కుభీర్

మేకలకు, గొర్రెలకు వ్యాక్సినేషన్ వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ విశ్వజిత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పశువైద్యశాలలో గొర్రెలకు, మేకలకు వ్యాక్సినేషన్‌ను వేసి పశు యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గొర్రెల లబ్ధిదారులకు సంబంధించిన ఈ పశుదన్ యాప్‌లో గొర్రెలను, మేకలను నమోదు చేసుకోవాలని అన్నారు. దీంతో గొర్రెలకు, మేకలకు దాదాపుగా1200 జీవాలకు టీకాలు వేయడం జరిగిందని అన్నారు. అదే విధంగా గొర్రెలకు, మేకలకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఆయన వెంట పశు వైద్య సిబ్బంది అవినాష్, రైతులు ఉన్నారు.



క్రీడాకారులు రాణించేందుకు కోచ్‌లు కష్టపడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడాకారులను ప్రోత్సహిస్తు వారు రాణించేలా కోచ్‌లు మరింత కష్టపడాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేది వరకు హుజురాబాద్‌లో జరిగిన ఎస్జీఎఫ్ అండర్-14 బాలుర రాష్ట్రస్థాయి పోటీల్లో ఆదిలాబాద్ హాకీ జట్టు చాంపియన్‌గా నిలిచింది. కప్ గెలుచుకొని సోమవారం ఆదిలాబాద్‌కు వచ్చిన జట్టును జిల్లా కలెక్టర్ రాజర్షిషా కలెక్టరేట్‌లో వారిని అభినందించి శాలువాతో సత్కరించారు. సెమిఫైనల్లో రంగారెడ్డిపై 5 గోల్స్ విజయం సాధించి, ఫైనాల్స్‌కు చేరిందని ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావ్, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారధి కలెక్టర్‌కు వివరించారు. ఫైనల్‌లో నిజామాబాద్‌పై కూడా 5 గోల్స్‌లో గెలిచి చాంపియన్‌గా గెలుపొందారని తెలిపారు. క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉందని, ఆటల్లో రాణించాలని కలెక్టర్ సూచించారు. అదే విధంగా కోచ్‌లు కూడా మరింత కష్టపడి జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలన్నారు. అదే విధంగా పీడీ అనిత, డాక్టరేట్ పట్టా పొందడంతో ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఈఓ ప్రణీత, ఓలంపిక్ అసోసియేషన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కోచ్‌లు జాదవ్ రవీందర్, శేఖర్, శ్రీను, అతూల్, గోవింద్, మహ్మద్, ఏజాజ్ ఉన్నారు.

ఫుడ్ ఫాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ రాజకీయ కోణం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో సంక్షేమ గురుకుల హాస్టల్స్‌లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనల వెనుక బీఆర్ఎస్ రాజకీయ కోణం ఉందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు ఆరోపించారు. సోమవారం పట్టణంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సంక్షేమ హాస్టళ్ల కార్యదర్శిగా పని చేసిన ప్రస్తుత ఆ పార్టీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ భారీ కుట్రకు సూత్రధారి అని ఆరోపించారు. అప్పట్లో ఫుడ్ కాంట్రాక్టు, వర్కర్స్‌ను నామినేట్ పద్ధతిలో నియమించడంతో ప్రస్తుతం ఆ సిబ్బంది అంతా ఇంకా ఆయన కంట్రోల్లోనే ఉన్నారని అన్నారు. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేసి, రాజకీయ లబ్ధి పొందే కుట్రలో భాగంగా ఈ తతంగమంతా జరగుతుందని మండిపడ్డారు. విద్యార్థుల్లో పోషకుల్లో పెరుగుతున్న విశ్వసనీయతను దెబ్బతీసి, ప్రభుత్వ ప్రతిష్టతను దిగజార్చేందుకు విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు బీఆర్ఎస్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మావల మాజీ సర్పంచ్ దొగ్గలి రాజేశ్వర్, మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ, నాయకులు బూర్ల శంకరయ్య, దాసరి ఆశన్న, శ్రీరామ్, ప్రశాంత్, సదాలి రామన్న, నరిగి ఆశన్న యాదవ్ పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై జడ్జితో విచారణ జరిపించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ములుగు జిల్లా చెల్పాక గ్రామ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయవిచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ములుగు జిల్లా గ్రామం ఏటూరు నాగారం మండలం చెల్పాక గ్రామ సమీపంలో ఏడుగురు మావోయిస్టులను ఎన్‌కౌంటర్లో చనిపోయినట్టుగా ములుగు పోలీసులు ప్రకటించారని, ఈ ఎన్‌కౌంటర్‌పై గ్రామస్తులు, చనిపోయిన కుటుంబాలు ఇది ఎన్‌కౌంటర్ కాదని, వారిపై విషప్రయోగం జరిపి పట్టుకొని చిత్రహింసలు పెట్టి కాల్చి చంపినట్లు చెబుతున్నారని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత ఉన్న స్థితిని బట్టి కూడా బూటకపు ఎన్‌కౌంటర్లో హత్యాకాండ కొనసాగించినట్టు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఎన్‌కౌంటర్లను ఆపాలని దేశంలో రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలకు అధికారం శాశ్వతం కాదని తెలిపారు. ఈ దేశంలో ఆర్థిక అసమానతలు పోవాలనే లక్ష్యంతో సమసమాజ స్థాపనకై పోరాడుతున్న విప్లవ సంస్థలను బూటకపు ఎన్‌కౌంటర్లు చేయటం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

40 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా పోలీసు వ్యవస్థకు సేవలందించిన హోంగార్డు ఎండీ.యావర్ అలీ ఉద్యోగ విరమణ పొందారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందుతున్న హోంగార్డును జిల్లా పోలీసుల సమక్షంలో ఎస్పీ గౌస్ ఆలం పూలమాలలు, శాలువాతో సన్మానించారు. హోంగార్డు ఎండీ యావర్ అలీ 1984 సంవత్సరంలో ఆదిలాబాద్ జిల్లా హోంగార్డుగా పోలీసు వ్యవస్థలోకి అడుగుపెట్టి సుదీర్ఘకాలంగా వివిధ అధికారుల వద్ద కుక్‌గా విధుల నిర్వర్తించి, అధికారుల ప్రశంసలను అందుకోవడం జరిగిందని పేర్కొన్నారు. సర్వీస్‌లో రిమార్కులు లేకుండా విధులను నిర్వర్తించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ ఎస్.చంద్రశేఖర్, సిబ్బంది రమేష్, అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలలో ఫుడ్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా బ్రహ్మణవాడలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఫుడ్ మేళా నిర్వహించారు. విద్యార్థులు వంటకాలతో ఇక్కడ ప్రదర్శనతో పాటు అమ్మకాలు చేపట్టారు. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వాటిని కొనుగోలు చేసి రుచులను చూశారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి వంటకాల రుచులను చూసి అభినందిస్తూ పౌష్టికాహారం గురించి తెలియజేశారు. పౌష్టికాహారం గురించి తెలియక చాలా మంది విద్యార్థులు వాటిని తినడం లేదని ఉపాధ్యాయులు లచ్చిరాం తెలిపారు. విద్యార్థి దశ నుంచే ఏ వంటకంలో ఏ రకం పౌష్టికాహారం, శరీరానికి అవి చేసే మేలును వివరించేలా ఫుడ్ మేళాను నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పండ్ల శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్ర వాతావరణంలో భోజనం అందించాలి

- ఉమ్మడి జిల్లా ఫుడ్ కంట్రోలర్ టి.నాయక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వసతి గృహాల్లోని విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో నాణ్యమైన భోజనం అందించాలని ఉమ్మడి జిల్లా ఫుడ్ కంట్రోలర్ టి.నాయక్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వసతిగృహాల్లో ఫుడ్ ఫాయిజన్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో హాస్టల్ వార్డెన్, వెల్ఫర్ ఆఫీసర్, నర్సు, వంట మనుషులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఫుడ్‌పాయిజన్ కేసులు నమోదవుతున్న క్రమంలో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రతమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. వసతి గృహాల్లో పని చేసే వంట మనిషి, వెల్ఫర్ ఆఫీసర్, నర్సుతో పాటు బోధన, బోధనేతన సిబ్బంది నాణ్యమైన భోజనం శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. డిసెంబర్ 2 నుంచి 5వ తేది వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఇతర గురుకులాల వారికి శిక్షణ ఉంటుందన్నారు. ఫుడ్ పాయిజన్ వెంటనే అందించే చికిత్సలు గురించి తెలియజేశామన్నారు. విద్యార్థులు అస్వస్థకు గురైతే ఏ విధంగా స్పందించాలి. ప్రాణాపాయ స్థితికి రాకుండా తీసుకొవాల్సిన జాగ్రత్తలను వివరించామన్నారు. బాధ్యతగా హస్టల్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు భోజనాన్ని రోజు పరిశీలించడంతో పాటు విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, బీసీ వెల్ఫర్ అధికారి రాజలింగు, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్.పర్వతి సత్యనారాయణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్. పర్వతి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 317 జీఓతో ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని నియమించిందని తెలిపారు. కమిటి క్షేత్రస్థాయిలో పలు దఫాల వారిగా సుదీర్ఘ చర్చలు జరిపిన తర్వాత ప్రభుత్వానికి నివేదికను అందించిందని తెలిపారు. 317 జీఓ కారణంగా ఇబ్బందులు పడుతున్న వారికి బదిలీలు చేపట్టాలని, ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారి చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయడానికి పాఠశాల విద్యాశాఖ ద్వారా స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్, సంఘం నాయకులు సాయికృష్ణ, కిషోర్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులను నిర్వర్తించాలి

- నూతనంగా జిల్లాకు విచ్చేసిన 218 పోలీసు కానిస్టేబుళ్లు
- 140 సివిల్ పోలీసు సిబ్బందికి పోలీస్ స్టేషన్‌ల కేటాయింపు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రమశిక్షణ, అంకితభావంతో విధులను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో 9 నెలల పాటు కఠోర పోలీసు శిక్షణను తీసుకొని ఆదిలాబాద్ జిల్లాకు నూతనంగా విచ్చేసిన 218 పోలీసు సివిల్, ఏఆర్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సిబ్బందికి పోలీసు వ్యవస్థపై, పోలీసు విధులపై నిజ జీవితంలో చేయాల్సిన పనులపై ప్రత్యేకంగా సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ సమాజంలో బాధ్యతాయుతమైన పాత్రను పోషిస్తుందని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో చేయాల్సిన విధులపై కనీస అవగాహనను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు విచ్చేసిన సివిల్ 94 మెన్ కానిస్టేబుళ్లకు, 46 విమెన్ కానిస్టేబుళ్లకు, జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్స్‌లు ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ సెంటర్, సాంకేతికతను వినియోగించుకుని సిబ్బంది, రైటర్స్, జనరల్ డ్యూటీ, కోర్టు డ్యూటీ లాంటి విధులు ఉంటాయని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో నేర నియంత్రణ, నేర పరిశోధన అలాంటి అంశాలు ముఖ్య పాత్రను పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, బి.సురేందర్ రెడ్డి, హసీబుల్లా, ప్రకాష్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, పోలీస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తే మూల్యం తప్పదు

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

ప్రజా ఆశీర్వాదంతో ఎన్నికల్లో గెలిచిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారని, దానికి మూల్యం చెల్లించక తప్పదని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం భైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీజేపీ కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై ఛార్జ్ షీట్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టి బడుగు బలహీన వర్గాల వారికి మోసం చేశారన్నారు. మూసి ప్రక్షాళన అంటూ, ఆర్ఆర్ టాక్స్ పేరుతో రేవంత్‌రెడ్డి వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. కాలేశ్వరం పేరుతో కేసీఆర్ అవినీతి చేస్తే హైడ్రా, మూసి ప్రక్షాళన పేరుతో రేవంత్ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అబద్దాలతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డికి సీఎం సీటులో కూర్చునే అర్హత లేదని అన్నారు. కొడంగల్‌లో ఫార్మసిటీ పేరుతో గిరిజనులకు చెందిన 20 ఎకరాల భూమిని లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని, గుంట భూమి ఇవ్వకుండా చూస్తామని బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేపడతామన్నారు. రైతు రుణమాఫీ ఇప్పటివరకు మాఫీ చేయకుండా రైతులను మోసం చేశారని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై మండిపడ్డ రామారావు పటేల్...

ముధోల్ నియోజకవర్గంలో గుండెగాం వాసులు 18 సంవత్సరాలుగా పునరావాసం లేకుండా ఉంటే మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు. 10 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉండి స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లో చేరిన ఆయన మాయ మాటలతో ప్రజలకు మోసం చేస్తున్నారన్నారు. బాసర ఆలయాభివృద్ధికి రూ.42 కోట్ల నిధులు తెచ్చామని, మంత్రి సీతక్క ముందు ఫోటోలకు ఫోజులు ఇచ్చి మాజీ ఎమ్మెల్యే చేతులు దులుపుకున్నారన్నారు. నెల రోజులు గడుస్తున్నా నిధుల జాడ లేదన్నారు. 2027లో పుష్కరాలు వస్తున్నాయని బాసర ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టి అభివృద్ధి చేయాల్సిందిగా సూచించారు. తాను శాసనసభలో నియోజకవర్గానికి చెందిన అనేక సమస్యలను ప్రస్తావించడం జరిగిందని, బాసర త్రిబుల్ ఐటీ, గుండెగాం పునరావాసం, 28 ప్యాకేజీ పనుల విషయమై మాట్లాడమన్నారు. 28 ప్యాకేజీ పనులు పూర్తయితే నియోజకవర్గంలో 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో సీఎం రేవంత్‌రెడ్డి వివక్ష చూపుతూ, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు అంతా కలిసి 30 నిమిషాల పాటు ప్రధానమంత్రికి సమస్యలు వివరించడం జరిగిందన్నారు. వచ్చే బడ్జెట్ తర్వాత కేంద్ర ప్రభుత్వం బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నచోట పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తుందన్నారు. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో చూపుతూ, ఢిల్లీలో ప్రధానికి, కేంద్ర మంత్రులను కలుస్తూ నిధుల కోసం వంగి దండాలు పెడుతున్నారన్నారు.

ప్రభుత్వం వైఫల్యాలపై ఈనెల 5న భారీ బహిరంగ సభ...

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో నియోజకవర్గం అంతటా నిరసనలు తెలిపి ఈనెల 5న ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు బీజేపీ నాయకులు కార్యకర్తలు పెద్ద మొత్తంలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ రాజేష్ బాబు, జిల్లా సహా కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపల్లి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్డా, నారాయణరెడ్డి ఉన్నారు.

ఆరు గ్యారంటీ హామీలు ఏమయ్యాయి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అధికారంలో రాక ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏమయ్యాయని బీజేపీ మండలాధ్యక్షుడు ఆరెల్లి రాజలింగం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో హామీలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించాడని ఆరోపించారు. అధికారంలో వచ్చిన తరువాత ఆ పథకాలను నిర్వీర్యం చేశాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పట్టా సాధించిన శ్రీలత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణానికి చెందిన కొప్పుల శ్రీలత డాక్టరేట్ పట్టా సాధించారు. వరంగల్‌లోని నీట్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొ.బిద్యాధర్ సుబుద్ధి చేతుల మీదుగా ఈ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. రాబోయే కాలంలో కరువు నివారణ చర్యలపై అధ్యయనం చేసినందుకు డాక్టరేట్ అందుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. స్థానిక అగ్రజ టౌన్‌షిప్‌లో నివాసముంటున్న కొప్పుల శ్రీలత భర్త సెంట్రల్ వేర్ హౌజింగ్ కో-ఆపరేషన్ మేనేజర్ వి.రవికుమార్ ప్రోత్సాహంతో ప్రొఫెసర్ ఆనందరాజ్ సూచనల మేరకు అధ్యయనం పూర్తి చేశామన్నారు. ఈ మేరకు డాక్టరేట్ అందుకున్న శ్రీలతకు అభినందనలు వెల్లువెత్తాయి.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



నవతెలంగాణ-కడెం

మండలంలోని జెడ్పీఎస్ఎస్ లింగాపూర్ పాఠశాలలో పాఠశాలస్థాయి జీవశాస్త్ర ప్రతిభ పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఈ పరీక్షల్లో 28 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో ఇంగ్లీష్ మీడియంలో ఎమ్.జీవన జ్యోతి, ఎస్.అమూల్య, తెలుగు మీడియంలో సతీష్, రాకేష్‌లు టాపర్స్‌గా నిలిచారని ప్రధానోపాధ్యాయులు వెంకట్ రమణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాల్గొట్ కిషన్, మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామం వద్ద 44 జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ సిస్టం ఆదివారం రాత్రి ప్రారంభించారు. జాతీయ రహదారి మరమ్మతులు చేపట్టి నాలుగు లైన్ల రోడ్డు వేశారు. రోడ్డు ప్రారంభమైనప్పటికీ లైటింగ్ సిస్టం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదాలు తరచూ జరగడంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు కిలోమీటర్ మేర సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఐటీఐ కళాశాలలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన పెరగాలంటే వ్యాసరచన పోటీలతో పాటు జనరల్ నాలెడ్జ్‌పై కూడా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అప్పుడే విద్యార్థులు భవిష్యత్తులో ఎలాంటి పోటీ పరీక్షల్లోనైనా రాణిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-ఉట్నూర్

ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ కేబీ కాంప్లెక్స్ వారి ఆధ్వర్యంలో పదోతరగతి చదువుకున్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు మగ్గం, కుట్టు మిషన్, సెల్‌ఫోన్ రిపేరింగ్, హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ అందజేస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ మహమ్మద్ గౌస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏండ్లలోపు వారు ఈనెల ఐదు లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

చిరుత దాడిలో గేదె మృతి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



చిరుత దాడిలో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని దరోగాపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఫారెస్ట్ రేంజ్ అధికారి అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దరోగాపల్లి గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం మేతకు వెళ్ళిన పశువులు ఇంటికి వచ్చే దారిలో చిరుత పులి గేదపై దాడి చేసింది. పశువుల కాపరులు చిరుతను చూసి బిగ్గరగా కేకలు వేస్తూ ఉండడంతో చిరుత అడవిలోకి వెళ్ళింది. సోమవారం ఉదయం అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని దాడి చేసింది పెద్దపులి కాదని చిరుతని నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. దరోగాపల్లి గ్రామానికి చెందిన వరిమండ్ల శ్రీనివాస్‌కు చెందిన గేదెగా గుర్తించారు. పశుయజమానికి అటవీ శాఖ ద్వారా పరిహారం అందిస్తామన్నారు.

సర్వే వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి

నవతెలంగాణ-కెరమెరి



కులగణన సమగ్ర సర్వేలో సేకరించిన వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ ఉస్సేన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సర్వే విరాలను నమోదు చేస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో పాల్గొన్న ఎన్యూమ రేటర్లు వివరాలను ఎంట్రీ చేసే సమయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. సర్వే వివరాల నమోదును వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అమ్జత్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, విద్యాధికారి ఆడే ప్రకాష్, ఆర్ఐ పవన్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఇబ్బందులు పట్టావా..?

- బీఆర్ఎస్ అసెంబ్లీ కన్వీనర్ లెండుగురే శంకర్
- సమస్యలు తెలుసుకొనివ్వకుండా అడ్డంకులు ఎందుకు..?



నవతెలంగాణ-సిర్పూర్(టి)

వసతిగృహాల్లోని సమస్యలను తెలుసుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపుమేరకు గురుకుల బాట కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థుల ఇబ్బందులు తెలుసుకోవడం జరుగుతుందని బీఆర్ఎస్ అసెంబ్లీ కన్వీనర్ లెండుగురే శంకర్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ముస్తఫా అన్నారు. కానీ అధికారులు తమను సమస్యలు తెలుసుకొనివ్వకుండా అడ్డుపడడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ సమస్యలు తెలుసుకోవడానికి నాయకులు వెళ్లారు. ఇక్కడి అధికారులు వారిని లోనికి అనుమతించకపోవడంతో గేటు ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికమైన ఆహారం, మౌలిక సదుపాయాలు తదితర సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించడానికి గురుకులబాట కార్యక్రమం చేపట్టామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ గురుకులాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల కార్యదర్శిగా ఉన్నప్పుడు వందలాది గురుకుల పాఠశాలను స్థాపించి ఎంతోమంది విద్యార్థులకు ఉన్నత విద్య విలువలు అందించారని గుర్తు చేశారు. అటువంటి గురుకుల పాఠశాలను కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. పోషకాహారాలు అందించడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యార్థులకు భద్రత లేకుండా పోయిందని, మంచినీరు సౌకర్యం, సానిటేషన్ సౌకర్యం బాగాలేదని, అదేవిధంగా కుళ్లిపోయిన కూరగాయలతో వంట చేస్తున్నారని ఆరోపించారు. దాని కారణంగా జిల్లాలో పలు వసతి గృహాల్లో విద్యార్థులు అస్వస్థతకు గురై చనిపోయిన సంఘటనలున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోయిన్, తాజ్, శేఖర్, రాజకుమార్, తిరుపతి, మండల కన్వీనర్ అస్లాం, మండల అధ్యక్షుడు నాందాజీ లక్ష్మణ్, సోఫీ, రవి వర్మ మహిళ కన్వీనర్ లలిత, కమల, నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో 135శాతం బొగ్గు ఉత్పత్తి

- బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో 135 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ తెలిపారు సోమవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి ఉత్పాదకత వివరాలను వెల్లడించారు. నవంబర్‌లో బొగ్గు ఉత్పత్తి 250 టన్నులకు గాను 3.39 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితో ఏరియాలో 135శాతం ఉత్పత్తి సాధించినట్లు వివరించారు. గోలేటి ఓసీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. 6 15 హెక్టార్ల ఫారెస్ట్ ల్యాండ్‌పై ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. త్వరలో ఫారెస్ట్ నుండి క్లియరెన్స్ వచ్చిన వెంటనే గోలేటి ఓసీ నుండి వచ్చే ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి ఆశించవచ్చన్నారు. పెద్దపల్లిలో జరగబోయే బహిరంగ సభలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సీఎండీ చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు బెల్లంపల్లి ఏరియా నుండి ఎనిమిది మందికి ఉద్యోగ నియమాక పత్రాలు అందుకోనున్నారన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఉజ్వల్ కుమార్ బెహరా, ఎస్ఓ టూ జీఎం రాజమల్లు పాల్గొన్నారు.

లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మండలంలోని గన్నారం గ్రామంలో నాలుగు రోజుల క్రితం పులి దాడిలో చనిపోయిన మోర్లే లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోర్లే లక్ష్మి కుటుంబానికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని, కుటుంబ సభ్యులు ఎవరూ అధైర్యపడవద్దని భరోసానిచ్చారు. పరామర్శించిన వారిలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ధోతుల శ్రీనివాస్, ముక్కెర శేఖర్, రవీందర్ ఉన్నారు.

ఇరుముడితో శబరిమలకు అయ్యప్పలు పయనం

నవతెలంగాణ-కౌటాల

ఇరుముడితో శబరిమలకు పయనమైన అయ్యప్ప స్వాములు మండలంలోని తలోడి హనుమాన్ మందిరంలో గురు స్వామితో ఇరుముడి కట్టించుకొని శబరిమలకు అయ్యప్ప భక్తులు సోమవారం పయనమయ్యారు. మాల ధరించిన 20 మంది భక్తులతో పాటు మాల ధరించని మరో 30 మంది భక్తులు మొత్తం 50 మంది భక్తులు శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరారు. మాల ధరించి 41 రోజులు కఠిన కఠోర దీక్ష అనంతరం మాల విరమణకు స్వామివారి సన్నిధికి భక్తులు బయలుదేరారు.

జయంతి వేడుకల పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిసెంబర్ 8న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే గాండ్ల తెలికుల ఆరాధ్యదైవం, భక్త తుకారాం అభంగాల రచయిత శ్రీసంతాజీ జగ్నడే మహారాజ్ 400వ జయంతి వేడుకల పోస్టర్లను కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు హీవ్రే సందీప్, నాయకులు తపసే శ్రీనివాస్, ఆకాష్, మురళీకృష్ణ, సంతోష్, పోచన్న, ఆనంద్ రావు, దశరథ్ కులస్తులు పాల్గొన్నారు.

'అటవీ అధికారులు డ్రామాలాడుతున్నారు'

- పులి కనిపిస్తేనే హంగామా చేస్తున్నారు
- ఫలితంగానే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు
- అటవీ అధికారులపై మండిపడ్డ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అడవి జంతువుల బారి నుండి ప్రజల ప్రాణాలను రక్షించడంలో అటవీ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆరోపించారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవిలో ఉండాల్సిన పులి పంట చేలల్లోకి వచ్చి రైతుల ప్రాణాలను తీసుకుంటున్న సమయంలోనే అటవీ అధికారులు డ్రామాలాడి హంగామా చేస్తున్నారే తప్ప ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీని ఫలితంగానే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. పులులు, ఏనుగుల బారిన పడి ఇప్పటి వరకు ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని, రైతుల ప్రాణాలను రక్షించడం చేతకాకపోతే బదిలీపై వెళ్లిపోవాలని సూచించారు. ఈ డివిజన్‌లో ఎన్ని పులులున్నాయనే సమాచారం కూడా తెలియని అచేతనావస్థలో అటవీ శాఖ ఉందన్నారు. పులులు ఏ ప్రాంతంలో ఉన్నాయో ముందే తెలుసుకొని ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అటవీ శాఖకు పులులు ఎక్కడున్నాయనే విషయాన్ని రైతులే చెప్పాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఎక్కడ ఎవరు అడవి పందిని చంపారో తెలుసుకోవడం, వారి నుండి మామూళ్లు వసూలు చేయడం, ఇవ్వని వారిని తీసుకువచ్చి వారిపై థర్డ్ డిగ్రీ ఉపయోగించడంపైనే అధికారులు దృష్టి సారిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాలపై ఈ నెల 9 నుండి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావిస్తానన్నారు. ఈ జిల్లాలో అటవీ శాఖను ప్రక్షాళన చేస్తేనే కాని సమస్యలు పరిష్కారం కావని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, మోనీ, కొంగ సత్యనారాయణ, దోని శ్రీశైలం పాల్గొన్నారు.

వీఆర్ఏ వారసులకు ఉద్యోగం ఇవ్వాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జీఓ నెంబర్ 81 ప్రకారం 61 సంవత్సరాలు దాటిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్ డిమాండ్ చేశారు. వీఆర్ఏలతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 సెప్టెంబర్ 9న గత ప్రభుత్వం అసెంబ్లీలో వీఆర్ఏలకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. ఆ హామీలను అమలు చేయాలని వీఆర్ఏలు రాష్ట్రవ్యాప్తంగా 80 రోజుల పాటు దీర్ఘకాలిక సమ్మె పోరాటం ఫలితంగా గత ముఖ్యమంత్రి రెవెన్యూ అధికారుల సమక్షంలో వీఆర్ఏ జేఏసీతో చర్చలు జరిపి జీఓ నెం. 81, 85లను విడుదల చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20,556 మంది వీఆర్ఓలలో డిగ్రీ చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్లుగా, ఇంటర్ చదివిన వారిని రికార్డు అసిస్టెంట్స్‌గా, పదవ తరగతిలోపు చదివిన వారిని ఆఫీస్ సబార్డినేటర్స్, రెవెన్యూ శాఖతో పాటు, మున్సిపల్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, విద్యా, వైద్య తదితర శాఖల్లో ఉన్న ఖాళీల్లో 16,758 మంది వీఆర్ఏలను ప్రభుత్వం సర్దుబాటు చేసిందన్నారు. ఆ జీఓలో ఉన్న మిగతా 3,797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా 16 నెలలుగా ప్రభుత్వం కాలయాపన చేసిందన్నారు. ఇప్పటికైనా వారసులకు ఉద్యోగాలు ఇచ్చి వారికి రక్షణగా నిలవాలని కోరారు. దీనికోసం రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు స్వరూప, అజ్గర్‌అలీ, రజినీకాంత్, రాజయ్య, ప్రియాంక, అనిత, సతీష్, కిషోర్, అంకుల్, వెంకటేష్ పాల్గొన్నారు.

జీసీసీ సరుకులు సక్రమమేనా..?

- తేల్చుకోలేని స్థితిలో అధికార యంత్రాంగం
- ఇంకా పోలీస్ స్టేషన్‌లోనే ఉన్న సరుకుల వ్యాన్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన నిత్యావసర సరుకుల వ్యాన్ ఆదివారం కాగజ్‌నగర్‌లోని ఒక ప్రయివేట్ ఇంటి ముందు నిలిపి ఉండగా పోలీసులు పట్టుకున్న విషయం తెల్సిందే. ఆ వ్యాన్‌లోని సరుకులను ప్రయివేట్ వ్యక్తి ఇంట్లో దింపేందుకు ప్రయత్నిస్తుండగా ముందస్తుగా అందిన సమాచారం మేరకు పోలీసులు ఈ వ్యాన్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఉదంతంపై పోలీసు శాఖ సూచనల మేరకు సోమవారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. రెవెన్యూ అధికారులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సరుకులను పరిశీలించారు. కాగజ్‌నగర్ జీసీసీ మేనేజర్ భుక్యానాయక్‌ను స్థానిక తహసీల్దార్ కిరణ్ విచారించారు. ఈ విచారణలో సరుకులు సక్రమమైనవా లేక అక్రమంగా తరలించారా అనేది తేలలేదు. ఆసిఫాబాద్ జీసీసీ మేనేజర్ భుక్యానాయక్ కాగజ్‌నగర్ జీసీసీ మేనేజర్‌గా కూడా ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం పట్టుబడ్డ సరుకుల వ్యాన్ ఆసిఫాబాద్ జీసీసీకి చెందినదని మేనేజర్ రెవెన్యూ అధికారులకు తెలిపినట్లుగా తెలిసింది. ఇదే నిజమైతే ఆసిఫాబాద్ నుండి ఆ వ్యాన్ కాగజ్‌నగర్‌కు ఎందుకు వచ్చిందనేది ఇక్కడ అనుమానంగా మారింది. పైగా ఆ వ్యాన్‌లోని సరుకులన్నీ చెడిపోయాయని, వాటిని పారవేసేందుకు వ్యాన్‌లో లోడ్ చేసినట్లుగా మేనేజర్ చెపుతున్నారు. చెడిపోయిన సరుకులను పారవేయకుండా కాగజ్‌నగర్‌లోని ప్రయివేట్ వ్యక్తి ఇంటికి ఎందుకు తీసుకువచ్చారనేది కూడా ఇక్కడ అనుమానమే. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులకు జీసీసీ మేనేజర్ నుండి స్పష్టమైన వివరణ రాకపోవడంతో వారు తలమునకలవుతున్నారు. ఉట్నూరులోని జీసీసీ డిపో మేనేజర్‌కు సమాచారం అందించి తదుపరి చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు. దీనిపై తహసీల్దార్ కిరణ్‌ను సంప్రదించగా మేనేజర్ భుక్యానాయక్‌ను విచారించామని, ఈ విచారణలో పలు సందేహాలు వ్యక్తమైనట్లు తెలిపారు. జీసీసీ డిపో మేనేజర్, డీఎస్ఓకు సమాచారం అందించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా ప్రజలకు మరింత చేరువలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 1 నర్సింగ్ కళాశాల, 1 పారామెడికల్ కళాశాల, 1 ట్రాన్స్ జెండర్స్ క్లినిక్‌లను ప్రారంభించిందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. సోమవారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 108 నూతన అంబులెన్స్‌లు, రాష్ట్రంలో 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కళాశాలలు, 33 జిల్లాలలో జిల్లాకు ఒకటి చొప్పున మైత్రి ట్రాన్స్ క్లినిక్‌లను ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించగా, జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా జిల్లాలో 1 నర్సింగ్, 1 పారామెడికల్ కళాశాలలు, 1 ట్రాన్స్ జెండర్స్ క్లినిక్‌లను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జిల్లా వైద్య కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల, పారా మెడికల్ కళాశాల ద్వారా వివిధ కోర్సులు నిర్వహించడం జరుగుతుందని, ఈ కోర్సుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కోర్సుల ద్వారా ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, విద్యార్థులు కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నర్సింగ్ కళాశాల విద్యార్థులతో ప్రజలకు అందించే సేవలపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, పారామెడికల్, నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పద్మలత, లత, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 4న జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాల మైదానంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్ మహిళా జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ఆత్రం లింగరావు, జిల్లా కార్యదర్శి ఆత్రం ధర్మారావులు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారు 7నుండి10వ వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, పాల్గొనేవారు రూ. 100 ప్రవేశరుసుము చెల్లించి ఉదయం 9 గంటలకు పేర్లు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు ఆత్రం లింగరావు సెల్ : 9390191068, 9441734946 నెంబర్లను సంప్రదించాలన్నారు.

గ్రామ సభపై డప్పు చాటింపు

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామసభ ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గణేష్ గ్రామ సభ ఏర్పాటుపై మండల కేంద్రంలోని పలు వీధుల్లో డప్పు చాటింపు వేయించారు. ఉపాధి కూలీలు హాజరు కావాలని తెలిపారు. వచ్చే మార్చి నాటికీ చేపట్టే పనులపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేశామని జిల్లా మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు వేడుకలు నిర్వహించడం జరుగుతుందని, ఈ వేడుకలలో అధికారులు, దివ్యాంగులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేధిక

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక ఉంటుందని, ఈ ప్రజావేదికకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి హాజరు కానున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. 10 రోజులుగా గ్రామపంచాయతీలలో సామాజిక తనిఖీ బృందం సిబ్బంది క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించారన్నారు. ఈ పనుల వివరాలను ప్రజవేదికలో వెల్లడిస్తారని తెలిపారు.

విద్యాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో విద్యాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2014 పూర్వమే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గురుకులాలు ప్రారంభించిందని, బీఆర్ఎస్ తామే గురుకులాలు ప్రారంభించినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గురుకులల్లో కొద్ది కాలంగా జరుగుతున్న సంఘటనల్లో రాజకీయ నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. పది సంవత్సరాల్లో ఎమ్మెల్యేగా ఉన్న కోవలక్ష్మి ఎన్నడు గురుకులాలను పట్టించుకోలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కేజీ టూ పీజీ అని ఎన్నో సందర్భాల్లో చెప్పారని అయితే ఇది ఆచరణలో పెట్టలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్‌మెంట్ పూర్తిగా అధ్వానంగా తయారు చేశారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన సంవత్సరకాలంలో 9 సంవత్సరాల్లో ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఫీజు రీయంబర్స్‌మెంట్‌లో ఇప్పటికే రూ.1600 కోట్లు విడుదల చేస్తున్నట్లు గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో 2018 నుండి 2023 వరకు గురుకులంలో చదువుతున్న విద్యార్థులు రాజేష్, అశ్విని, ఐశ్వర్య, సంగీత మృతి చెందినప్పుడు కనీస వారిని పరామర్శించిన దాఖలాలు కూడా లేవని, శైలజ మృతిపై అనవసర రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఇదే సందర్భంలో ఆమెకు నిమ్స్‌లో అత్యుత్తమ వైద్యం అందించినట్లు గతంలో జరిగిన సంఘటనలు కనీసం బాధితులను పరామర్శించని నాయకులు మంత్రిని రాజీనామా చేయమని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏడాదిలోపే 54,000 ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ లాంటివి అమలు చేసిన ఘనత తమదేమన్నారు. ప్రతిపక్ష పార్టీలు అనవసర ఆరోపణలు మాని తాము చేస్తున్న విద్యాభివృద్ధికి తోడ్పడాలని పలికారు. రాష్ట్రం విద్యాభివృద్ధి చెందడం ప్రతిపక్షాలకు రుచించడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు మసాడే చరణ్, మాజీ ఎంపీపీ బాలేశ్ గౌడ్, నాయకులు అసద్, వసంతరావు, కలీం, భాస్కర్, దినకర్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలో సాంకేతిక విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం ఇచ్చారు. వెనుకబడ్డ ఈ జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, అగ్రికల్చర్ డిప్లొమా కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారని, ప్రతీ ఏటా 1500 మంది 2000ల మంది విద్యార్థులు పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షలకు హాజరవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో అప్పటి కలెక్టర్ హేమంత్ బోర్కడే, జూన్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కకు వినతిపత్రాలు ఇచ్చామని, సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చి ఎన్నికలు కాగా పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని సాంకేతిక విద్యాసంస్థల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ పొన్న రమేష్, నాయకులు ఎండి ముజామిలుద్దీన్, హైమద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-కెరమెరి





టీఎస్‌యూటీఎఫ్ నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైద్య శాంతికుమారి, సోయం హిందువు ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షులుగా సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా గణేష్ ఉపాధ్యక్షులుగా సఫల్, పంచాపాల, కోశాధికారిగా మోహియుద్దీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. సంఘ బలోపేతానికి అహర్నిశలు పాటుపడాలని సూచించారు

దానపూర్‌లో పులి సంచారంపై అవగాహన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మేకల మందపై పులి దాడి చేసిన నేపథ్యంలో ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ సింగ్ సర్దార్ మండలంలోని దానాపూర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పులి సంచారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి అటవీ అధికారులకు సహకరించాలని కోరారు. సాయంత్రం పూట అటవీ ప్రాంతంలో తిరగకూడదని, ఎక్కడైనా పులి తిరుగుతోందని అనుమానం కలిగించే వెంటనే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, బీట్ అధికారి రాజేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.



వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని మిట్టపల్లి గ్రామంలో న్యూ లైఫ్ ప్రేయర్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ సభ్యుడు బొడ్డు చరణ్ తేజ ఐదు వయోజన విద్యా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బొడ్డు రవి జోసెఫ్, సేవాభారత్ ఏరియా కో ఆర్డినేటర్ బత్తుల శ్యామ్ ఇజాయిస్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా అనేది జీవితంలో చాలా ప్రధానమైనదని అన్నారు. చదువుకోవడం వల్ల అలుముకున్న చీకటి తొలగి జీవితంలో గొప్ప వెలుగు విరభూస్తుంది. విద్యా అజ్ఞానపు చీకట్లను పారద్రోలి జ్ఞానపు వెలుగులను అందిస్తుంది. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, సుమలత, రాణి, రాధిక, మౌనిక, బైరంలింగయ్య, వినయ్, శ్యామల, లక్ష్మీ రాజేశ్వరి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని గిరిజన ఏఎన్ఎం అవుట్‌సోర్సింగ్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి రాజమణి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఏఎన్ఎం సమస్యలు ప్రభుత్వం నేటికీ పరిష్కారం చేయలేదని, 2022లో 5 నెలలు, 2023 మార్చి నుంచి ఇప్పటివరకు 9 నెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయని, వేతనాల గురించి ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగిన వినతిపత్రాలు ఇచ్చిన మా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈ 18వ తేదీ లోపు పెండింగ్ వెతనాలు మొత్తం చెల్లించాలని, లేకుంటే డిసెంబర్ 19 నుంచి విధులు బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, కమిటీ సభ్యులు లలిత, సునీత, భారతి, స్వప్న, మహేశ్వరీ, శ్వేత పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి పట్టణంలో ప్రభుత్వ భూములను కాపాడేందుకు అధికారులు ప్రణాళికలు చేపడుతున్నారు. పట్టణ పరిధిలోని ఏప ప్రాంతాలలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యాయి అక్రమ కట్టడాలు ఎక్కడ వెలిశాయి. అక్రమనదారుల వివరాలను ఆరా తీస్తున్నారు. సంబంధిత భూముల క్షుణంగా రికార్డులను పరిశీలించి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నారు. అవసరం మేరకు పోలీస్ అధికారుల సహాయం తీసుకొని భూ అక్రమాలకు చెక్ పెడుతున్నారు. రెండు రోజుల క్రితం కన్నాల శివారులోని సర్వే నంబర్ 141, 142, 90లో వెలిసిన అక్రమ కట్టడాలను కూల్చి వేశారు. అక్రమ కంచెలను ఫెన్సింగ్ పోళ్లను తొలగించారు. బెల్లంపల్లి పట్టణంలో భూ అక్రమాణాలపై ఉన్నతాధికారులకు నాయకులకు వివిధ వర్గాల నుండి ఒత్తిళ్లు రావడంతో అధికారులు కబ్జాలపై దృష్టి సారించారు. స్థానిక ఎమ్మెల్యే సైతం భూకబ్జాలను కట్టుదిట్టం చేయాలని ఆదేశించడంతో రెవెన్యూ అధికారులుపై పట్టు బిగించారు. ఎన్నో ఏళ్లుగా వివాదంలో ఉన్న షంషీర్ నగర్‌లో షాదీఖానా స్థలాన్ని స్వాధీనం చేసుకొని మైనార్టీ సంక్షేమ అధికారులకు అప్పగించారు. వివాదంలో ఉన్న షాదీఖానా స్థలం విషయమై మైనార్టీ నాయకుల నుండి ఒత్తిళ్లు రావడంతో వివాదాన్ని త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రంగంలోకి దిగిన ఆర్డీఓ హరికృష్ణతోపాటు, ఏసీపీ రవికుమార్, తహసీల్దార్ జోష్న భూమిని స్వాధీనం చేసుకొని దగ్గరుండి షాదీ ఖానా స్థలాన్ని చదును చేయించారు. షాదీఖానకు రెండు ఎకరాల స్థలం ఉండాల్సిఉండగా వినియోగంలో లేకపోవడంతో 26 గుంటలు అన్యాక్రాంతమైంది. రెవెన్యూ అధికారులు మైనార్టీ సంఘం నాయకులను సంప్రదింపులు జరిపి ప్రస్తుతం ఉన్న స్థలాన్ని చదును చేసి ఇస్తామని నచ్చజెప్పడంతో వారు అంగీకరించారు. ఆర్డిఓ హరికృష్ణ, ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య భూమిని బుల్డోజర్‌తో చదును చేయించారు. షాదీఖానా స్థల వివాదం పరిష్కారం కావడంతో మైనార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

భూకబ్జాలపై ప్రత్యేక దష్టి

జోష్న తహసీల్దార్, బెల్లంపల్లి.



స్థానిక ఎమ్మెల్యే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూకబ్జాలపై దృష్టి సాధిస్తున్నాం. ఇప్పటికే పలు ప్రాంతాల్లోని కబ్జాలకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నాం. అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం జరిగింది. షాదీఖానా స్థల వివాదాన్ని పరిష్కరించాం. ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించకుండా శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం ప్రభుత్వ భూములు కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే ఆర్థికంగా నష్టపోతారు.

సీఎం కప్ పోటీల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి



నవతెలంగాణ నస్పూర్

సీఎం కప్ పోటీలలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపాలని జిల్లా యువజన క్రీడా అధికారి కీర్తి రాజ్వీరు అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యలయంలో జిల్లాలో నిర్వహించనున్న సీఎం కప్ పోటీలపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఒలంపిక్ కార్యదర్శి పి.రఘునాథ్‌రెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులు, వివిధ క్రీడాంశాల ప్రతినిధులు, పీఈటీ, పీడీలు, సీనియర్ క్రీడాకారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడా అధికారి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సి.ఎం. కప్-2024లో భాగంగా ఈ నెల 7, 8 తేదీలలో గ్రామ స్థాయి, 10 నుండి 12వ తేదీ వరకు మండల స్థాయి, 16 నుండి 21వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయా స్థాయిలలో ఉత్తమ ప్రతిభ కనబచిరి జిల్లా స్థాయిలో అత్యుత్తమ స్థాయి ప్రతిభ కనబరిచిన వారిని డిసెంబర్ 27, 2024 నుండి జనవరి 2, 2025 వరకు జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. వివిధ క్రీడా అంశాలకు సంబంధించి పోటీలు నిర్వహిస్తామని, జిల్లాలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాలు, వెనుకబడిన తరగతులు, గిరిజన, మైనార్టీ సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాలు, ఎంజేపీ, మోడల్, కస్తూరిభా గాంధీ విద్యాలయాల పిల్లలలో ఆసక్తి గల వారు పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థులు తాము పాల్గొనదలచిన క్రీడా అంశం వివరాలను సీఎంకప్2024.తెలంగాణ.జీఓవి.ఇన్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని, ఆ దిశగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివిధ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.రమేష్, కబడ్డీ కార్యదర్శి రాంచందర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు, పీడీలు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

8న హక్కుల సాధనకు ప్రజారగ్ జోల్ యాత్ర



నవతెలంగాణ-కాసిపేట

గిరిజనుల సమస్యలపై గిరిజన హక్కుల సాధనకు ఈ నెల 8వ తేదీ నుంచి భద్రాది కొత్తగూడెం నుంచి ఆదిలాబాద్ జిల్లా వరకు ప్రజారగ్ జోల్ యాత్ర నిర్వహిస్తున్నట్టు సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర తిరుపతి నాయక్ తెలిపారు. సోమవారం కాసిపేట మండలంలోని లంబాడీతండా(కె) గ్రామంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగ్గోత్ మల్లేష్ నాయక్ అధ్యక్షతన జిల్లా కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న బంజారా గిరిజనుల బిడ్డలు ప్రతి ఒక్కరూ ఈ ప్రజారగ్ జోల్ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సంధర్భంగా సేవాలాల్ సేన యూత్ మండల అధ్యక్షుడిగా బానోత్ రవి నాయక్‌ను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర తిరుపతి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జాదవ్ గజానంద్ నాయక్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు దరావత్ కైలాస్ నాయక్, జిల్లా విద్యార్థి సేన అధ్యక్షులు గుగులోతు బాలాజీ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శులు దరావత్ రమేష్, బదావత్ రమేష్, జిల్లా కార్యవర్గ నిర్వహక అధ్యక్షుడు అజ్మీర రాజేష్, జిల్లా యూత్ అధ్యక్షుడు భూఖ్య రమేష్, భీమారం మండల అధ్యక్షులు మోతీలాల్, లంబాడీతండా (కె) గ్రామ అధ్యక్షులు రాజు, గ్రామ నాయక్ గనిరాం, యూత్ కార్యదర్శి నగేష్, సోమగూడెం(కె) గ్రామ నాయక్ శ్రీనివాస్ నాయక్, గుగులోత్ భీమా, దేవ్ సింగ్, తిరుమల్, రాజమల్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు విద్యార్థి ప్రయోగం

నవతెలంగాణ-జన్నారం



స్థానిక జడ్పీ బాలుర పాఠశాలకు చెందిన బోయిని సాయితేజ చేసిన ప్రయోగం రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైంది. వరద సమయంలో ప్రత్యామ్నాయ డ్రైనేజీ వ్యవస్థ' పై చేసిన ప్రయోగం రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. దీంతో ఆయన ప్రయోగాన్ని ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ విజయ్ కుమార్ తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలన వార్షిక విజయోత్సవాలలో నిర్వహించిన పోటీలలో రాష్ట్రస్థాయికి కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఎంపిక కావడం హర్షించదగ్గ విషయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన శక్తి వనరులు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వేల్పుల నరేందర్ పదవ తరగతి విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగినదన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో మల్టీపర్పస్ అగ్రికల్చర్ సాధనంను తయారుచేసిన విద్యార్థులు గేడంసందేశ్ అక్కల నితీష్(పదవ తరగతి విద్యార్థులు) ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనటువంటి విద్యార్థులను, గైడ్ టీచర్స్ కె రాజన్న, బుచ్చి లింగయ్య, నగేష్, జ్యోతిశీలలను మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, సెక్టోరియల్ ఆఫీసర్స్ చౌదరి, సత్యనారాయణమూర్తి, శ్రీనివాసరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న అభినందించారు. అలాగే జన్నారం మండల కేంద్రంలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం పొందిన వేల్పుల నరేందర్‌ను మండల విద్యాధికారి నడిమెట్ల విజయ్ కుమార్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు, కలమడుగు ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి. సిపిఎస్. రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్,ఎస్సీ.ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి రాజన్న, జిల్లా అధ్యక్షులు ఆర్ .శ్రీనివాస్ మోటివేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రకాష్ బానావత్ యు.టి.ఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాపు,నరసయ్య, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు జాడి మురళి, గోవర్ధన్, నగేష్, అశోక్ కుమార్, మనెమ్మ, నరహరి శర్మ ,శ్రీనివాస్, రజిత రాణి, కాంతయ్య, శ్రీనివాస్,అబ్దుల్ అజీమ్, సుస్మిత, స్వప్న మరియు ఎం.ఆర్.సి సిబ్బంది, కోఆర్డినేటర్ వెంకటేష్, సి ఆర్ పి లు శేఖర్, దయాకర్ విద్యార్థులను అభినందించారు.

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి



నవతెలంగాణ నస్పూర్

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నె సాగర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 61 సంవత్సరాలు వయసు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. గత ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో వీఆర్ఏలకు పే స్కేల్, వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించిందని తెలిపారు. ఈ హామీలను అమలు చేయాలని వీఆర్ఏలు రాష్ట్రవ్యాప్తంగా 80 రోజులు సమ్మె చేసిందని, దానికిగాను అప్పటి ప్రభుత్వం స్పందించి రెవెన్యూ అధికారుల సమక్షంలో వీఆర్ఏ జేఏసీతో చర్చలు జరిపి జీవో నెంబర్ 81, 85లను విడుదల చేసిందన్నారు. దీని ప్రకారం విద్యార్హతను బట్టి వీఆర్ఏలకు వివిధ శాఖలకు పంపించడం జరిగిందని, మిగిలిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా కాలయాపన చేసిందన్నారు. వీఆర్ఏ వారసులకు ఉద్యోగం వస్తుందని 16 నెలలుగా ఎదురు చూస్తున్నామని, ప్రభుత్వం జీఓలు ఇచ్చినా కూడా ఉద్యోగ అవకాశం కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగవకాశం కల్పించకపోవడం తో మానసిక ఒత్తిడిని తట్టుకోలేక దాదాపు 2008 మంది వీఆర్ఏలు మరణించారని తెలిపారు. గత 16 నెలలుగా రెవెన్యూ ఆఫీసులలో 20,555 మంది చేసే పనిని వయసు పైబడిన 3,797 మందితో చేయిస్తున్నారని, దీంతో వారు అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వం వీఆర్ఏల వారసులకు ఉద్యోగావకాశం కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ముడిమడిగెల ప్రశాంత్, ఇప్ప బాపు, పొన్నాల ప్రశాంత్, సైదల రామయ్య పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు

నవతెలంగాణ-నస్పూర్



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మైనార్టీ గురుకులాల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో మైనారిటీ గురుకులాల్లో జరుగుతున్న ఉద్యోగ నియమకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని మైనార్టీ గురుకులల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరుగుతున్నాయని, రెండు రోజుల క్రితం టీచింగ్, నాన్ టీచింగ్ బెల్లంపల్లి గురుకుల సంబందించిన నోటిఫికేషన్‌లో డిప్యూటీ వార్డెన్ పోస్టు ఈ సంవత్సరం ఫిబ్రవరి నుంచి ఖాళీగా ఉన్న దీనిని నోటిఫికేషన్‌లో పెట్టకుండా ఒకరికి హైదరాబాద్ నుంచి ఆర్డర్ కాపీ వచ్చిందన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులు వివరాలు తెలపకుండా హెడ్ ఆఫీస్ నుండే ఆర్డర్ కాపీలు వస్తున్నాయని, గతంలో ఇలాగే జరిగితే ప్రిన్సిపల్ సెక్రటరీ మైనార్టీ సెక్రటరీకి జిల్లాలో ఎలాంటి ఖాళీలు ఉన్న వాటిని జిల్లా త్రిమెన్ కమిటీ ద్వారానే సెలక్షన్స్ చేయాలని మెమో కూడా ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. కాని ప్రిన్సిపల్ సెక్రెటరీ చెప్పిన విషయాలను పెడచేవిన పెట్టిన మైనార్టీ స్టేట్ ఆఫీస్ అడ్మిన్ అధికారులు, బెల్లంపల్లి డిప్యూటీ వార్డెన్ పోస్టుకు హైదరాబాద్ నుంచి వచ్చినటువంటి ఆర్డర్ కాపీని వెంటనే క్యాన్సల్ చేయాలని డిమాండ్ చేశారు.

డిస్మిస్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఒప్పందం


నవతెలంగాణ-మందమర్రి



మైనింగ్ స్టాఫ్‌కు సర్ఫేస్‌లో షుటేబుల్ జాబు ఇవ్వడానికి, డిస్మిస్ అయిన జేఎంఈటీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఒప్పందం చేసుకున్నట్లు ఏఐటీయూసీ వేజ్ బోర్డు శాశ్వత సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. ఏఐటీయూసీ మందమర్రి కార్యాలయంలో ఆదివారం సాయంత్రం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా యూనియన్ వేజ్ బోర్డు శాశ్వత సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య, బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సింగరేణిలో కొన్ని సంఘాలు పనికట్టుకొని ఏఐటీయూసీ యూనియన్ ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొత్తగూడెంలో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో డైరెక్టర్ ఆధ్వర్యంలో కొన్ని సమస్యలపై ఒప్పందాలు కుదిరాయన్నారు. ప్రధానంగా మైనింగ్ స్టాఫ్ మెడికల్ అన్ ఫిట్ అయితే గతంలో షుటేబుల్ జాబు ఇవ్వకుండా జనరల్ మజ్దూర్‌గా ఇచ్చేవారు అన్నారు. పది సంవత్సరాల నుంచి వీరి సమస్యలపై అనేక ఉద్యమాలు చేసినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ ఉన్న సమయంలో ఏనాడు సంఘంపై పోరాటం చేయని సీఐటీయూ, హెచ్ఎంఎస్ ఇవ్వాల ఏఐటీయూసీని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికల్లో మనుగడ కోల్పోయిన అక్కసుతోనే విమర్శిస్తున్నారని తెలిపారు. చౌకబారు విమర్శలు మానుకొని కార్మికుల మన్ననలు పొందాలని సూచించారు. మైనింగ్ స్టాఫ్‌కు సర్ఫేస్‌లో షుటేబుల్ జాబు ఇవ్వడానికి, డ్యూటీలు చేయలేక డిస్మిస్ అయిన జేఎంఈటీ కార్మికులకు విధుల్లోకి తీసుకోవాలని ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. డిసెంబర్ నెలలో జరిగే సిఅండ్ఎండి స్ట్రక్చర్ సమావేశంలో ట్రేడ్మెన్‌కి కూడా మెడికల్ అన్ఫిట్ అయితే షుటేబుల్ జాబు ఇవ్వాలని కోరబోతున్నట్లు తెలిపారు. తమ సమస్యను పరిష్కరించినందుకు మైనింగ్ స్టాఫ్ సీతారామయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ భీమ నాధుని సుదర్శన్, బ్రాంచ్ నాయకులు కంది శ్రీనివాస్, రాజేశం, బానయ్య, తిరుపతి, రాజేష్, వెంకటేశ్వర్లు, సుదర్శన్, రామదాసు, అంటోని దినేష్, ఎగ్గేటి రాజేశ్వరరావు, మైనింగ్ స్టాఫ్ నాయకుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పశువులకు కృత్రిమ గర్భాదారణ చేయించండి

నవతెలంగాణ-జైపూర్



అధిక పాల దిగుబడి సామర్థ్యం గల మేలు జాతి ఆవుదూడల పునరుత్పత్తికి కృత్రిమ గర్భాధారణ చేయించాలని భీమారం పశు వైద్యులు రాకేష్ శర్మ సూచించారు. భీమారం మండలం ఎల్కేశ్వరం గ్రామంలో సోమవారం ఉచతి గర్భకోశ చికిత్సతో పాటు రైతులకు అవగాహణ కార్యక్రమం చేపట్టారు. ఈ సంధర్భంగా రైతులతో మాట్లాడుతూ కృత్రిమ గర్భాధారణ ద్వారా కలిగే లాభాలు, దేశవాళీ పశువులకు మేలురకం వీర్యం దానం వలన మేలు జాతి ఆవుదూడలను పొందవచ్చునని తెలిపారు. తద్వార అధిక పాల దిగుబడి సామర్థ్యం గల ఆవుదూడలతో ఆర్థికంగా లాభాలు పొందవచ్చునని తెలిపారు. అదేవిధంగా గ్రామాలలో అతి తక్కువ సమయంలో మేలు జాతి పశు సంపదను అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుత కృత్రిమ గర్భధారణ కోసం వినియోగిస్తున్న సాధారణ వీర్య నాళికల ద్వార 50 శాతం మాత్రమే ఆడ దూడలు పుంటే అవకాశం ఉంటుందని అన్నారు. లింగ నిర్ధారిత వీర్య నాళికల వినియోగంతో 90 శాతం కంటే ఎక్కువ మేలు జాతీ ఆడదూడలు పుట్టి ఆవులు, గేదెల సంఖ్య పెంచుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్లు రవి, సిబ్బంది నర్సింహులు, సంపత్, రమేష్ పాల్గొన్నారు.

ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్



తన భార్య మృతికి కారణమైన టచ్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని సివిని అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఆమని(42) అనారోగ్య కారణంగా మంచిర్యాలలోని టచ్ ఆస్పత్రికి వెల్లారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి కడుపులో గడ్డలు అయ్యాయని, వెంటనే ఆపరేషన్ చేయాలని తెలిపారన్నారు. వైద్యుల సూచించిన ప్రకారమే అక్టోబర్ 17వ తేదీన ఆపరేషన్ చేయించారని, మూడు రోజుల తర్వాత ఇన్ఫెక్షన్ అయిందని మరోసారి ఆపరేషన్ చేశారని పేర్కొన్నారు. మరల అక్టోబర్ 20వ తేదీన మళ్లీ ఆపరేషన్ చేసారని దానితో తన భార్య పరిస్థితి విషమంగా మారిందన్నారు. తన భార్య ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించడంతో మెరుగైన వైద్య నిమిత్తం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించాలని సూచించడంతో వారి వద్ద డబ్బులు లేవని చెప్పగా, ఆస్పత్రి వారే డబ్బులను సర్దుబాటు చేసి హుటాహుటిన తరలించారని తెలిపారు. హైదరాబాదులో పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ ఫెయిల్ కావడంతోనే ఆమనీ ఆరోగ్య పరిస్థితి క్షీనించందని అక్కడి వైద్యులు తెలిపినట్లు పేర్కొన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అక్టోబర్ 29వ తేదీన మరణించిందని అన్నారు. తన భార్య మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తన భార్య మృతికి కారణమైన ఆస్పత్రిపై చర్యలు తీసుకొవాలని వేడుకున్నారు.

హెచ్ఎంఎస్ నాయకున్ని అరెస్టు చేయడం సరికాదు

నవతెలంగాణ-నస్పూర్

హెచ్ఎంఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్ బోర్డ్ సభ్యులు కామ్రేడ్ రియాజ్ అహ్మద్ అక్రమ అరెస్టును ఖండిస్తున్నట్లు, వెంటనే బేషరతుగా విడుదల చేయాలని శ్రీరాంపూర్ బ్రాంచ్ కమిటీ డిమాండ్ చేస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో సింగరేణి కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు అరెస్టు చేయడం సమంజసం కాదని, రాష్ట్ర ప్రభుత్వం కార్మిక నాయకులను అక్రమంగా అరెస్టులు చేస్తే తీవ్ర మూల్యం చెల్లించక తప్పదని పేర్కొన్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించినందుకే గోలేటి నుండి కొత్తగూడెం వరకు ఒక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యేని కూడా గెలవకుండా సింగరేణి కార్మికవర్గం సరైన తీర్పునిచ్చిందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని సింగరేణి కార్మికులకు ప్రధానంగా నూతన బొగ్గు గనులు ఏర్పాటు చేయడం, ఇన్కంటాక్స్ విధానాన్ని రద్దు చేయడం, బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పడం, ప్రతి కార్మికునికి 250 గజాల భూమి అలాగే రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని పేర్కొన్నారు.

మీ సేవ ఫెడరేషన్ అధ్యక్షుడుగా బోడ సతీష్



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి నియోజకవర్గ మీసేవ ఫెడరేషన్ అధ్యక్షులుగా తాండూర్ మండలం మాదారంకు చెందిన బోడ సతీష్ ఎన్నికయ్యారు. మంచిర్యాలలోని సున్నంబట్టివాడ లయన్స్ క్లబ్‌లో తెలంగాణ మీ సేవ ఫెడరేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. తెలంగాణ మీ సేవ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరా శంకర్, ప్రధాన కార్యదర్శి మొహిద్, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ సమక్షంలో పలు సమస్యలపై చర్చించి అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడుగా బోడ సతీష్ ఎన్నికయ్యారు.

రైతుల ఖాతాల్లో రూ.7.91 కోట్లు జమ

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో 315 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి రూ. 7 కోట్ల 91 లక్షల నగదు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేసినట్టు అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిపాదించిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 315 కొనుగోలు కేంద్రాల ద్వారా 8 వేల 50 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత 502 మంది రైతుల ఖాతాలలో రూ.7 కోట్ల 91 లక్షల జమ చేసినట్టు తెలిపారు. జిల్లాలో 13 రైస్ మిల్లులకు సీఎంఆర్ అనుమతులు ఇచ్చామన్నారు.

వన్‌టైం సెటిల్‌మెంట్‌తో రుణ విముక్తి పొందండి

నవతెలంగాణ-జైపూర్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమారం శాఖ నుంచి రుణాలు పొంది తిరిగి చెల్లించలేని వారు రిన్ సమాదాన్-వన్‌టైం సెటిల్‌మెంట్ 2024-25 ద్వారా రుణ విముక్తి పొందాలని బ్రాంచ్ కార్యనిర్వాహణ అధికారి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14న నిర్వహించ తలపెట్టిన జాతీయ లోక్ అదాలత్ ద్వార కూడ రుణ విముక్తి పొందవచ్చునని తెలిపారు. వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వార రుణ విముక్తి పొందాలని ఆశించిన వారు ఈ పథకం ద్వార అర్హత పొందుతున్నట్లు భీమారం ఎస్‌బీఐ బ్రాంచ్‌లో నేరుగా సంప్రదించాలని తెలిపారు. అదేవిధంగా పంట రుణాలు పొందిన రైతులు సకాలంలో పంట రుణం చెల్లించకుండా, రిన్యూవల్ చేయకుండా ఉన్న వారు కూడా బ్యాంకు ద్వార సమాచారం పొందవచ్చునని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
5
మంగళవారం | డిసెంబర్ 03, 2024 | www.navatelangana.com

జాతీయస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



డిసెంబర్ 5 నుండి 12 వరకు జమ్మూ కాశ్మీర్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే 68వ జాతీయస్థాయి పోటీలకు జిల్లా కేంద్రంలోని గిరిజన గ్రూపులో బాలికల పాఠశాల కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ గత నెలలో మెదక్‌లో పాఠశాల క్రీడ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్ 17 విభాగంలో పాఠశాల నుండి మధుప్రియ, ఆర్తి ఎంపికయ్యారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి రాష్ట్రంలో 18 మంది ఎంపిక కాగా ఇద్దరు తమ విద్యార్థులు కావడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ రవికుమార్, పీఈటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఐచర్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. టౌన్ ఎస్సై దీకొండ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఒల్డు కాలనీకి చెందిన బీమనాతం జీవన్ (32) ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఒల్డుకాలనీకి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బెజ్జూర్‌కు చెందిన ఐచర్ వ్యాన్ అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో జీవన్ తీవ్ర గాయాలపాలుకాగా స్థానికులు పట్టణంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించే క్రమంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు అక్షయ్ (4వ తరగతి), కుమార్తెలు అన్విక(2), చిట్టి(నాలుగు నెలలు) ఉన్నారు. మృతుని సోదరుడు సాయిరాం ఫిర్యాదు మేరకు బెజ్జూర్‌కు చెందిన ఐచర్ వ్యాన్ డ్రైవర్ కావిడె గంగన్నపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ రేంజ్ పరిధిలో కొన్ని రోజుల నుంచి పులి సంచరిస్తుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రెవాల్ అన్నారు. సోమవారం సిర్పూర్ రేంజ్ కార్యాలయంలో విలేకరితో మాట్లాడుతూ సిర్పూర్ రేంజ్ పరిధిలో కొన్ని రోజులను రెండు పులులు తిరుగుతున్నాయని, అందులో ఒక పులి ఆదివారం రాత్రి మహారాష్ట్రకు వెళ్లినట్టు తెలిపారు. తమ సిబ్బంది పులి జాడలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్టు వివరించారు. ప్రస్తుతం పెద్ద బండ, ఆరెగూడ, చిలపెల్లి, లింబుగూడ, ఇటిక్యాల పహాడ్ అటవీ విక్షేత్రంలో ఉన్నట్లు ఈ గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పుకార్లు నమ్మకూడదని పులి జాడలు కనిపిస్తే అటవీ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు.

అదనపు కలెక్టర్‌గా ఎం.డేవిడ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఎం.డేవిడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అధికారులను సమన్వయం చేసుకుంటూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు. వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను మండల, జిల్లా అధికారులతో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధి, విధి నిర్వహణలో తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ పర్యవేక్షకులు, జిల్లా అధికారులు బదిలీపై వచ్చిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. కాగా ఎం. డేవిడ్ ఇంతకు ముందు మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా విధులు నిర్వహించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని రెబ్బెన మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ప్రజా సంఘాల నాయకుడు వెలిశాల కృష్ణమాచారి డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో జరిగిన అభివృద్ధికి పెట్టుబడి పెట్టిన బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. లక్షల రూపాయలు పెండింగ్‌లో ఉండడంతో పనులు చేసిన వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బాధితులు మాయ, విజయ, జానకి, సునిత, రమాదేవి, సమీర పాల్గొన్నారు.

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

గతంలో షాదీ ముబారక్, కల్యాణ్ లక్ష్మికు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణి ఉంటుందన్నారు. దీనికి ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్ హజరై లబ్దిదారులకు చెక్కులు అందిస్తారని తెలిపారు.

కొనసాగుతున్న అటవీశాఖ అవగాహన సదస్సులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న వేసవికాలంలో అడవిలో నిప్పు వెలిగించకూడదని అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి. సోమవారం మండలంలోని చిర్రకుంట గ్రామంలో ఫారెస్ట్ బీట్ అధికారులు సాధిక్, వెంకటేష్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిలో నిప్పు వెలిగించొద్దన్నారు. అటవీ ప్రాంతాన్ని సంరక్షిస్తే అది ప్రజల ఆరోగ్యవంతమైన జీవితం కోసం పనిచేస్తుందన్నారు. అడవుల సంరక్షణకు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాధాకిషన్, కృష్ణయ్య, వెంకటేష్, రవి, హనుమంత్ పాల్గొన్నారు.

గురుకులాలను ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుంది

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గడిచిన సంవత్సర కాలంలో గురుకులాలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని జిల్లా బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి ఎండీ ముస్తఫా ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కోవలక్ష్మి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను నిర్వర్యం చేసే కుట్ర చేస్తుందని, గురుకులాలలో వరుస మరణాలు, ఆహారం కల్తీ అవుతున్న రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందన్నారు. విద్యా వ్యవస్థపై ఇప్పటివరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సంవత్సరం పూర్తయిన విద్యశాఖ మంత్రి నియమించకపోవడం దారుణమన్నారు. గురుకుల సమస్యలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాయి శ్రావణ్, శ్రీకాంత్, ప్రవీణ్, సీపెల్లి సాగర్, రామ్ శేఖర్, అరుణ్, తాజ్, శంకర్ పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రభుత్వం ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ట్రాన్స్ జెండర్ల సంక్షేమం, ఆరోగ్యం దృష్ట్యా క్లినిక్‌ను ప్రారంభించడం జరిగిందని, జిల్లాలోని ట్రాన్స్ జెండర్లు వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ మైత్రి క్లినిక్‌లలో కౌన్సెలింగ్, ఆరోగ్య, ఆరోగ్యయేతర సేవలు, లింగ ఆధారిత, సాధారణ ఆరోగ్య సేవలతో పాటు లైంగికంగా సంక్రమించే వ్యాధుల చికిత్సలు, సామాజిక అర్హత సేవలు, ఇతర క్లినికల్, ల్యాబ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ క్లినిక్‌లు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పని చేస్తాయని, ట్రాన్స్ జెండర్లకు సమాన గౌరవం, సమగ్ర సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ఆస్పత్రి పర్యవేక్షకులు, సఖి సిబ్బంది, ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు.

పులి సంచారంపై రైతుల బయందోళన



చింతలమానేపల్లి: అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

నవతెలంగాణ-కౌటాల

పులి పుకారతో రైతులు భయాందోళన చెందుతున్నారు. సోమవారం మండలంలోని బోదంపల్లి, నాగపల్లి, గుండాయిపేట గ్రామాలలో పులి ఇటు వచ్చిందంటే అటు వచ్చిందని పుకారాలు లేపడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సంబంధిత ఫారెస్ట్ అధికారులు దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు చేన్‌లో పత్తి ఎరేందుకు వెళ్లాలంటే జంకుతున్నారు. పోలీస్ అధికారులు గ్రామగ్రామాన తిరిగి గుంపులుగుంపులుగా వెళ్లాలని ఒక్కరొక్కరుగా వెళ్ళకూడదని అవగాహన కల్పిస్తున్నారు. కానీ రైతులు పంట చేతికొచ్చిన సమయంలో ఇలాంటి భయాందోళనకు గురికావడంతో పంట చేనుకు వెళ్ళడానికి బయపడుతున్నారు. సంబదిత అధికారులు స్పందించి రైతులకు భరోసాగా నిలువాలని రైతులు కోరుతున్నారు.

చింతలమానేపల్లి : మండలంలోని బాబాసాగర్ గ్రామంలో పులి భయంతో పొలాల్లోనే పత్తి తీసే రైతులు ఆందోళన చేందుతున్నారు. ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ హైమావతి ఆధ్వర్యంలో పొలాల్లోని రైతులు పత్తి తీసేందుకు ఉదయం పది గంటల ప్రాంతంలో పొలాలకు వెళ్ళేందుకు ఒకరుకాకుండా గుమికూడి వెళ్లాలని సూచించారు. పులి ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. పొలాలకు వెళ్లే రైతులు తప్పనిసరిగా కర్ర తీసుకొని, చేతుల్లో స్టీల్ ప్లేట్లతో చప్పుడు చేస్తూ వెళ్లాలని సూచించారు. ఆమెతో పాటు ఎఫ్‌బీఓ ప్రభాకర్ ఉన్నారు.

స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులు పరిష్కరించాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. తన కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ఫిర్యాదారుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల ఎస్ఐ, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకుంటూ, వారివారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తుందన్నారు.

బాధితులకు అండగా భరోసా సెంటర్

బాధిత మహిళలకు పిల్లలకు భరోసా సెంటర్ అండగా ఉంటుందని ఎస్పీ డివి శ్రీనివాస్ రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ గత ఫిబ్రవరి 17న జిల్లా కేంద్రంలో భరోసా సెంటర్ ప్రారంభించామని ఇప్పటివరకు సెంటర్‌కు 20 కేసులు వచ్చాయని దీనిలో 15 కేసులు పోక్సో చట్టం కింద ఉండగా, ఐదు కేసులు రేప్ కేసులున్నాయని తెలిపారు. వీటిలో బాధిత మహిళలకు కౌన్సెలింగ్ అందించామని, ఇలా వ్యాప్తంగా 8 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా బాధితులు ఉంటే 8712670561 నెంబర్ ద్వారా భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని, విషయాన్ని గోప్యంగా ఉంచడం జరుగుతుందని వివరించారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



నవతెలంగాణ-కెరమెరి

అడవుల సంరక్షణ అందరి బాధ్యతని ఎఫ్ఆర్ఓ మజారుద్దీన్ అన్నారు. సోమవారం మండలంలోని ధనోర గ్రామస్తులకు అటవీ జంతువుల పరిరక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. గతంలో ఇచ్చిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలున్నంతవరకు మాత్రమే భూమి సాగు చేసుకోవాలన్నారు. ఎక్కువగా చెట్లు నరికి సాగు చేస్తే పీడీ యాక్టు చట్టం కింద కేసు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే అడవిలో దొరికే ఇప్ప పువ్వు ఇతర పండ్ల సేకరణ ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అటవీ సంరక్షణలో గ్రామస్తులు తమకు సహకరించాలని కోరారు. అక్రమ కలప తరలించకుండా ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా అక్రమంగా కలప తరలిస్తే అటవీ అధికారులకు తెలియజేయాలన్నారు. అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టకూడదని అది పర్యావరణానికి ముప్పు కలిగిస్తుందన్నారు. అటవీ జంతువుల సంరక్షణ వల్ల పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అటవీ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి నుండి జిల్లా కేంద్రానికి వచ్చే దారిలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో నేషనల్ హైవే మేనేజర్ రంజన్ కుమార్, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ రోడ్డు నుండి పట్టణానికి వచ్చే దారి గుండా మూలమలుపు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నయని తెలిపారు. మూలమలుపు వద్ద ఉన్న ఎత్తైన ప్రాంతాన్ని చదును చేసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. భారత్ పెట్రోల్ పంపు సమీపంలో ఉన్న యూటర్న్‌ను మూసివేయించాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. సాయిబాబా ఆలయ సమీపం నుండి నేషనల్ హైవే వరకు అప్రోచ్ రోడ్డుపై బీటీ వేయాలన్నారు. రోడ్డు వెడల్పులో సమాధులు కోల్పోవుతుండడంతో వారి పేరున మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిఎస్పి కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

బీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కారించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని బీసీ విద్యార్థుల సమస్యలు పరిష్కారించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేశ్ అన్నారు. సంఘం నాయకులతో కలిసి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ డేవిడ్‌తో పాటు కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను సన్మానించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ విద్యార్థుల గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. గురుకులాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. బీసీలకు ఫీజుల విషయంలో ర్యాంకుల విధానాన్ని ఎత్తివేసి ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. విద్య వైద్యాన్ని జాతీయం చేసి ఉచితంగా అందించాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని, విద్యార్థుల మరణాలపై నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లోహబడే లహు కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్, మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోశే శంకర్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నిరుద్యోగ చైర్మన్ పొన్న రమేష్ పాల్గొన్నారు.



ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల వ్యాన్ పట్టివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా మీదుగా అక్రమంగా తరలిస్తున్న పశువుల వ్యాన్‌ను జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నుండి జిల్లా మీదుగా హైదరాబాద్‌కు పశువులను తరలిస్తున్న సమాచారం మేరకు సోమవారం ఉదయం ప్రధాన రహదారిపై తనిఖీలు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. బొలెరో వాహహనంతో పాటు తొమ్మిది పశువులను స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు వివరించారు. జిల్లాలో పశువుల అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో టాస్క్ ఫోర్స్ ఎస్ఐ వెంకటేష్, పీసీ రమేష్, మధు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపైన అవగాహన సదస్సు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో రాస్పల్లి హై స్కూల్‌లో విద్యార్థులకు మహిళ చట్టాలపై షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ఆశ్రమ హై స్కూల్ సిర్పూర్(టీ)లో నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత రమాదేవి మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లాలోని మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని, అలాగే ఏదైనా అత్యావసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలన్నారు. షీ టీం కాగాజ్‌నగర్ ఫోన్ నంబర్ 8712670565ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం, సిబ్బంది, షీ టీం సభ్యులు రమాదేవి, సునీత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు టీబీజీకేఎస్ మహాసభ

నవతెలంగాణ-రెబ్బెన

టీబీజీకేఎస్ మహాసభను గోలేటిలోని తెలంగాణా భవన్‌లో మహాసభ నిర్వహిస్తున్నామని ముఖ్య అతిథిలుగా రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరవుతారని బెల్లంపల్లి ఏరియా నాయకులు అంబాల ఓదెలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మహాసభలో కార్మికుల జీతాల పెంపుదలకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం గురించి చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున మహాసభకు తరలిరావాలని కోరారు.

7 నుంచి సీఎం కప్ పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ ఆటల పోటీలు ఈ నెల 7 నుండి 9వ తేదీ వరకు గ్రామపంచాయతీ స్థాయి, 10 నుండి 12వ తేదీ వరకు మండల స్థాయి, 16 నుండి 21వ తేదీ వరకు జిల్లా స్థాయిలలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా క్రీడల అధికారిని రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ, మండల స్థాయిలలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగ అంశాలలో పోటీలుంటాయన్నారు. 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు సబ్ జూనియర్, 14 నుండి 20 సంవత్సరాలలోపు వరకు బాలబాలికలకు జూనియర్, 20 సంవత్సరాలు పైబడిన పురుషులకు సీనియర్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, స్విమ్మింగ్, హ్యాండ్ బాల్, ఫుట్ బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగ, చెస్, బేస్ బాల్, నెట్ బాల్ అంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. ఈ క్రీడలలో ఆసక్తి గల క్రీడాకారులు తమ బయోడేటాను సీఎంకప్2024.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని, వివరాలకు జిల్లా క్రీడా యువజన శాఖ కార్యాలయం, సెల్ : 8008090626, 9550909870, 8099990509లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేయకూడదు : కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని, అర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన 70 దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు అందించారు. ప్రజలు ఇచ్చే అర్జీలపై అధికారులు బాధ్యతయుతంగా వ్యవహరించాలన్నారు. దరఖాస్తుదారుడి ఫిర్యాదుపై తీసుకున్న చర్యల గురించి తెలియజేయాలన్నారు. అదే విధంగా సివిల్, భూసంబంధిత, ఉద్యోగాలకు సంబంధించి అర్జీలు ప్రజావాణిలో ఇవ్వొద్దని సూచించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, జిల్లా అధికారులు, రెవెన్యూ విభాగం పాల్గొన్నారు.





పట్టాలివ్వాలని కలెక్టర్‌కు వినతి

జైనథ్ మండలం గిమ్మ గ్రామంలో డబుల్ బెడ్ రూంలో నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు గిమ్మ సంతోష్ కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆర్డీఓ వినోద్ కుమార్ లబ్దిదారుల వద్దకు వచ్చి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను కోరారు. లబ్దిదారులకు డబుల్ బెడ్ రూం పట్టాలు ఇచ్చి అధికారులు ఆదుకోవాలని విన్నవించారు.

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉట్నూర్ : గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. గాదిగూడకు చెందిన గ్రామస్తులు తమ గ్రామానికి అంగన్‌డీ కేంద్రం, సీసీరోడ్డు మంజూరు చేయాలని కోరారు. బేల మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కలిపించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ వసంతరావు, ఏపీఓ పీవీటీజీ మెస్రం మనోహర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బంగ్లాదేశ్‌లో హిందువులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామని సనాతన హిందు ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి అన్నారు. బంగ్లాదేశ్‌లో శాంతియుత వాతావరణం కల్పించేలా ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షిషాకు ఫిర్యాదు చేశారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై, దేవాలయాలపై అక్కడి ప్రభుత్వం అండతో అక్కడి అల్లరి మూకలు దాడులు చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు. అంతే కాకుండా శాంతియుతంగా భక్తీ మార్గంలో నడిచే స్వామీజీలపైన కూడా దాడులు చేస్తూ భయనకమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు బండారి వామన్, ప్రధాన కార్యదర్శి గెడం మాదవ్, కోశాషాకారి పడకంటి సూర్యకాంత్, కార్యనిర్వాహక అధ్యక్షులు కందుల రవీందర్, మాదస్తూ సంతోష్, ఉరాడే సుభాష్, మహిపాల్, పుప్పాల కిసాన్ పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న భౌతికదాడులను నిరసిస్తూ శాంతియుతంగా హిందూ ఐక్యవేదిక నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ ఆఫీస్ ఎదురుగా ఈ నెల 4న ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్టు హిందూ ఐక్యవేదిక సంఘం నాయకులు తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని ఖండిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటగిరి గోపి, నాయిడి రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో మోసపోయిన ప్రజలు


నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

గడిచిన ఏడాది కాంగ్రెస్ పాలనలో ప్రజలు మోసపోయారని బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. సోమవారం నిర్మల్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా ఏడాది వైఫల్యాలపై బీజేపీ చార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలు మంగ, జిల్లా కార్యదర్శి కోరిపల్లి శ్రావణ్‌రెడ్డి, నాయకులు ఆడెపు సుధాకర్, వడ్డే రాజేందర్ రెడ్డి, నూతుల భూపతిరెడ్డి, పొడెల్లి గణేష్, కొండా విశ్రావన్, తోట సత్యనారాయణ, కౌన్సిలర్లు ఎడిపెల్లి నరేందర్, బిట్లింగ్ నవీన్, ఆదుముల్లా పద్మాకర్ పాల్గొన్నారు

క్రీడలతోనే మానసికోల్లాసం

- మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి

నవతెలంగాణ-తలమడుగు



క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పల్సి(కె) గ్రామంలో విఠల్‌రుక్మాబాయి దేవాలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మిరాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, మాజీ సర్పంచ్ పాయల జ్ఞాను, యూత్ కాంగ్రెస్ నాయకుడు జ్ఞానేశ్వర్, పటేల్ రాములక్ష్మణ్, రావుల నారాయణ పాల్గొన్నారు.

శక్తి అభియాన్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ

నవతెలంగాణ-ఉట్నూర్

శక్తి అభియాన్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో ఈనెల 4, 5, 6 తేదీల్లో శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి శక్తి అభియాన్ జాతీయ చైర్మెన్ మణిశర్మ, జాతీయ కోఆర్డినేటర్ సౌజన్య, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ శివలాల్, తెలంగాణ రాష్ట్ర మహిళా ప్రతినిధులు సీతక్క, గుమ్మడి వెన్నెల, పలువురు ముఖ్య వక్తలు పాల్గొంటారని తెలిపారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ అంటేనే క్రమశిక్షణతో కూడుకున్నదని నాయకత్వంపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటే గెలుపు దానంతట అదే వస్తుందని అన్నారు. ప్రజల కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని, అప్పుడే మనతో పాటు పార్టీ కూడా బలపడుతుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పక్కాగా ముందుకెళ్లాలని, పోలింగ్ బూతుల వారిగా ఏర్పాటు చేసిన కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు ఆకుల ప్రవీణ్, రఘుపతి, జోగు రవి, కృష్ణ యాదవ్, గొర్ల రాము, శ్రీనివాస్, సోమ రవి, సుభాష్, రాకేష్, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన కార్పొరేషన్ చైర్మెన్‌కు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ కొట్నాక తిరుపతిని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలోని సరస్వతీ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ చైర్మెన్ ఆనంద్‌రావు, బేల మండలం పొనాల మాజీ ఎంపీటీసీ సాకరాం, సర్పంచులు ఆడే శంకర్, మోహన్, చందర్‌శావ్, నాగన్న ఉన్నారు.

స్కౌట్స్ భవనం, ప్రహరీకి నిధుల మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయ భవనం, ప్రహరీ నిర్మాణానికి నిధుల మంజూరు చేయాలని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రత్నాకర్, జిల్లా కార్యదర్శి స్వామి కోరారు. సోమవారం ఎమ్మెల్యే పాయల శంకర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. విద్యార్థుల్లో దేశభక్తి క్రమశిక్షణ పెంపొందించే శిక్షణ కార్యక్రమాలు అందించడానికి ప్రస్తుతం ఇబ్బందులు ఉన్నాయన్నారు. కార్యాలయ భవనం, ప్రహరీ నిర్మాణం జరిగితే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆదినాథ్ ఉన్నారు.

నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని కేబి కాంప్లెక్స్ ప్రాంగణంలో మంగళవారం వికాసం పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, అధికారులు హజరు కావాలని వికాసం పాఠశాల ప్రిన్సిపాల్ వికాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

డిసెంబర్ 4న జాతీయ సాధన సర్వే పరీక్ష

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

డిసెంబర్ 4న నిర్వహించనున్న జాతీయ సాధన సర్వే పరీక్షకు ఎంపిక చేయబడిన పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఆ రోజున తమ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వందశాతం హాజరుకావాలని డీఈఓ పి.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం10.30 గంటలకు జిల్లాలోని ఎంపిక చేయబడ్డ మొత్తం 91 పాఠశాలల్లోని 3వ తరగతికి 90 నిమిషాలు, 6వ తరగతికి 90నిమిషాలు, 9వ తరగతి విద్యార్థులకు 120నిమిషాల పాటు జాతీయ సాధన సర్వే పరీక్షను నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణకు 136 మంది పరీక్ష నిర్వాహకులు, 90 పరిశీలకులు పాఠశాలకు వస్తారని ప్రధానోపాధ్యాయులు వారికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఈ పరీక్షను ఆయా మండలాల విద్యాధికారులు, తమ పరిధిలోని పాఠశాలలను సందర్శిస్తారని పేర్కొన్నారు.